


కథ

# గుండెలో రైలు

పురాణం శ్రీనివాస శాస్త్రి

**ఢిల్లీ నుంచి వచ్చే రైలు కోసం ఎదురుచూడ్డం రంగన్న డ్యూటీలో చివరిభాగం.**

**అది వస్తుంది, వెళుతుంది.**

**మధ్యలో స్టేషన్ మాస్టర్ పచ్చ జెండా ఊపుతాడు.**

**ఆ వేళకు తాను ఆయనకి జెండా అందించాలి.**

రైల్వే కళాసీగా దశాబ్దాల నుంచి పనిచేస్తున్న రంగన్న పెద్ద వయసుని గుర్తించి ఈమధ్యనే స్టేషన్‌లో చిన్నాచితకా పనులకి మార్చారు పై ఆఫీసర్లు. అంతకు ముందు రైల్వే ఇంజనీర్ చేతికింద ఉండేవాడు. కొత్త డ్యూటీ ఎంతో నచ్చింది రంగన్నకి. ఢిల్లీ రైలు ఇంకా నచ్చింది. అది స్టేషన్‌లో ఆగకపోయినా స్టేషన్ మాస్టర్ ఊపే జెండా తను అందించాక, యధావిధిగా ఆ రైలు ఆగకుండా వెళ్లిపోయాక తన డ్యూటీ ముగుస్తుంది. అదీ రంగన్నకీ, ఢిల్లీ రైలుకీ ఉన్న సంబంధం.

డ్యూటీ కానిచ్చి ఇంటికొస్తూనే ఆరోజు తన గుడ్డి బుడ్డి స్టేషన్‌లో ఆగని ఆ ఢిల్లీ రైలు గురించి తన మనవడికి చెప్పాడు. మనవడి పేరు సుబ్బు. ఎనిమిదేళ్లవాడు. ఓసారి "కుఱ్ఱాడు మహా చురుకు. బాగా చదివించు" అని స్కూలు మాస్టరు చెప్పినపుడు రంగన్న పొంగిపోయాడు. మనవణ్ణి రైల్వే ఇంజనీర్ చేయాలని బలంగా సంకల్పం చెప్పుకొన్నాడు. ఆరోజు- ఆగని రైలు గురించి తాత చెప్పింది విని "అబ్బో ఢిల్లీ చాలా గొప్పూరు. అక్కడినుంచి వచ్చే రైలు బండి మనూళ్లో ఆగనంత గొప్పూరు" అన్నాడు తాతతో సుబ్బు. "ఎలాగైనా ఆ రైలు మనవూళ్లో ఆగితే బాగుణ్ణు" అన్నాడు గట్టిగానే. సుబ్బు ఆలోచన రంగన్నకి నచ్చింది. "అవును ఆ రైలు మనూళ్లో ఒక్కసారైనా ఆగితే బాగుంటుంది. కానీ నాకు టేషన్నించి ఇంటికాడకి రావడం లేటవుద్దిరా" అన్నాడు. సుబ్బు జాలితో కరిగిపోలేదు. "ఆ రైలు మనూళ్లో ఆగాల్సిందే" అన్నాడు కోపంగా. సుబ్బు గురించి మాస్టారు చెప్పిన 'చురుకుదనం' అప్పుడు వాడి కళ్లల్లో చూడగలిగాడు తాత.

"అవున్రా సుబ్బు, నీవన్నది శానా రైటు" అని. ఆ రైలు తమ ఊళ్లో ఆగితే ఆ ఊరు ఆ మేరకు గొప్పవుతుందని తలాడిస్తూ ఒప్పుకున్నాడు రంగన్న. అంతలోనే ఏదో సందేహం పీకింది.

"కానీ ఒరే! ఏ బండైనా ఎందుకాగుద్దిరా- ఇప్పుడు రిక్షాబండి తీసుకో. సవారీ మీద బండి అవసరం లేకుండా ఆగుద్దా? అలాగే బస్సు లేదా రైలు తీసుకో. ఆగేకాడా ఆగుద్దికానీ, ఆగిపొమ్మంటే ఆగదు కదా" అనకుండా ఉండలేక పోయాడు రంగన్న తాత కొంచెం ఆలోచించాకా.

సుబ్బు అందుగురించి చాలాసే ఆలోచించాడు. చిన్న పిడికిలి పెద్దగా బిగించాడు. "నేనాపుతాను తాతా" అన్నాడు పట్టుదలగా.

"ఒరే ... ఢిల్లీ రైల్నే... మనూళ్లోనే..." అంటూ రంగన్న తాత ఢిల్లీ రైలు రొప్పుతూ ఆగడం ఊహించుకొని సంబరపడిపోయాడు.

తాత సంతోషం పొడగట్టి సుబ్బు ఇధైపోయాడు. రైలు ఆపుతానని శపథం అయితే చేశాడు గానీ, ఎలా ఆపాలా అని తరువాత ఆలోచించాడు. వాడి చిట్టి బుఱ్ఱ ఐడియాలతో జామయి పోయింది. "నా మనువడు ఆలోచిస్తున్నాడు" అని మురిసిపోతూ టీ గ్లాసు అందించాడు రంగన్న. టీ అంతావేడిగాలేదు కానీ సుబ్బుకీ పది నిమిషాలు పట్టింది, ఆలోచనల మధ్య చప్పరిస్తూ తాగడానికి. రంగన్న ఆ పది నిమిషాలు మాట్లాడకుండా మనవణ్ణే గమనిస్తూ కూచున్నాడు. " ఈడు చానా పెద్ద వింజనీరు అయిపోతాడు" అని ఖాయం చేసుకున్నాడు మనసులో.

రైలు ఆపేసేందుకు సుబ్బులో ఖచ్చితమైన ఊహ విరిసే సంఘటన ఆ మర్నాడు జరిగింది.

***

ఎర్ర బస్సు... దాని ముందు టైర్లలో ఒకదానికి అంటుకున్న రక్తం అట్టకట్టి మట్టిరంగు తేలుతోంది. నడిరోడ్డు మీద కొంచెం సేపు గిలగిలా కొట్టుకొని ఆగిపోయిందో నడివయసు మనిషి ప్రాణం. అతని సైకిలు ఆ పక్కనే పడి ఉంది. దాని వెనక చక్రం ఇంకా తిరుగుతోంది.

తర్వాత పోలీసులొచ్చారు. ఆవెంటే అంబులెన్సొచ్చింది. అచేతన శరీరం అంబులెన్స్‌లోకి మారింది. చుట్టూ మూగిన జనం యాక్సిడెంట్లని తిట్టుకొంటూ, పోయిన వాడి కోసం జాలి పడుతూ, అతని కుటుంబాన్ని తలచుకొని బాధపడుతూ తమతమ భాషల్లో గొణిగారు. తమతమ దారుల్లో వెళ్లిపోయారు. కాస్సేపటికీ తమతమ వ్యాపకాల్లో పడిపోయారు.

అలాకాకుండా సుబ్బు అక్కడ నిలబడి తాను అప్పుడే చూసిన ఆ దృశ్యం గురించి ఆలోచిస్తున్నాడు. వాడి ఆలోచన ఒకదగ్గర తెగింది. అదే-యాక్సిడెంట్ దగ్గర. వాడికి ఓ విషయం అర్థమైంది.

నిన్న తాత ఏమన్నాడు- "రిచ్చాగాని, బస్సు గాని అలాగే రైలుగాని ఆగేచోట ఆగొచ్చుగాని ఆగమంటే ఆగుద్దా?" అని. అదే ప్రశ్న గురించి కాలం తెలియనంత సేపు ఆలోచించాడు సుబ్బు. తాను ఇప్పుడు చూసిన యాక్సిడెంట్‌లో కావలసిన జవాబు దొరికిందనుకొన్నాడు.

వాడికి మొదట్లో చాలా ఆశ్చర్యం అనిపించింది. తర్వాత సంతోషం వేసింది. గట్టిగా అరిచాడు- "బస్సు ఆగిందోచ్".

వెంటనే తాతకు తాను కనిపెట్టిన చిత్రం చెప్పాలని అనిపించింది. ఓ చేతిలో బొంగరం, రెండో చేతిలో తాడు లాగు జేబులోకి తోశాడు. వోడుతున్న ముక్కు తుడుచుకున్నాడు. పరుగు మొదలు పెట్టాడు జెండా రావి చెట్టువైపు. ఆ పక్కనే నిలవాలో, కూలిపోవాలో తేల్చుకోనట్టున్న ఓ ఇల్లు ఉంది. అది పెంకుటిల్లో, పూరిపాకో కూడా ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే ఓ పక్క పెంకులతో కనిపించే పైకప్పు మరోపక్క తాటాకు మట్టలతో సింగారించుకొని ఉంటుంది. ఆ ఇంట్లోనే తాత ఉండేది. ఆ సంతోషంలో వాడికి పరుగు 'శానా వీజీ' అనిపించింది.

**సుబ్బుది అసలే ఆయాసం... ఆపైన మాటలు దొరకని సంతోషపు జడి. వాడికి తెలియని కర్త, కర్మ, క్రియలు వాడిని ఇబ్బంది పెడుతున్నాయి. మాటలు వాక్యాలుగా మారడంలో ఏదో తబ్బిబ్బు అడ్డుపడుతోంది. మొత్తానికి కూడబలుక్కుని చెప్పాల్సిందేదో చెప్పేశాడు. తాతకి కొంత అర్థమయ్యీ కాలేదు. అయితే సుబ్బు ఆనందం తెలుసుకోగలిగాడు.**

తాతని ఆశ్చర్యపెట్టబోతున్న ఐడియా వాడికళ్లల్లో మెరుస్తోంది. పరుగు మధ్యలో రొప్పుతూ చెట్టు కింద ఆగాడు. వెనక్కి చూశాడు పస్తాయించి. దూరంగా ఎర్ర బస్సు ఆగినది ఆగిపోయినట్టే కనిపించింది. మనసుకి సంతోషం వేసింది.

ఇంటికెడుతూనే తాత మెడని చుట్టేసాడు. "బస్సు ఆగింది" అని చెప్పాడు హడావిడిగా. తాతకి అర్థం కాలేదు. ఏమైందేమైందని రెట్టించి అడిగాడు తాత.


సుబ్బుది అసలే ఆయాసం... ఆపైన మాటలు దొరకని సంతోషపు జడి. వాడికి తెలియని కర్త, కర్మ, క్రియలు వాడిని ఇబ్బంది పెడుతున్నాయి. మాటలు వాక్యాలుగా మారడంలో ఏదో తబ్బిబ్బు అడ్డుపడుతోంది. మొత్తానికి కూడబలుక్కుని చెప్పాల్సిందేదో చెప్పేశాడు. తాతకి కొంత అర్థమయ్యీ కాలేదు. అయితే సుబ్బు ఆనందం తెలుసుకోగలిగాడు. అదాటున వెళ్లి ఈతాకుల పెట్టె మూత తెరిచి తియ్యబూంది ఇవతలికి తీశాడు. మనవడి నోట్లో కుక్కాడు. సుబ్బు మాటల ప్రవాహానికి అడ్డంగా ఇప్పుడు తియ్యబూంది తోడైంది. ఇప్పుడు వాడి నోరు ఆడుతోంది వేరే పనిమీద.

రంగన్న తాతకి మడి కట్టిన పాదులా కనిపించాడు మనవడు. సుబ్బు తండ్రి వాడు పుట్టకముందే పోయాడు. ఈమధ్యనే పోయింది తల్లి. తన రైల్వే ఉజ్జోగం ఎలాగో తమిద్దరి కడుపులు నింపుతుంటే తమ కోసమే అన్నట్టు ఆ పాత పెంకుటిల్లు పడిపోకుండా ఆగింది.

సుఖంగానో, మరోలానో- రోజులైతే దొర్లిపోతున్నాయి. "ఆ సుఖం సాలదా మడిషికి" అని ప్రశ్నించు కున్నాడు రంగన్న మనవడిమీద ప్రేమ తాలూకు నిట్టూర్పుతో. అప్పుడప్పుడు పిచ్చి ఆలోచనలు వస్తుంటాయి సుబ్బు గురించి. తల్లీ తండ్రీ పోయినా తాను ఉండబట్టి సరిపోయింది. అలాకాకుండా తాను కూడా పోయింటే? ఆ ఆలోచనతో రంగన్న గుండె బరువెక్కు తుంది. మనవడే పోయి తాను మిగిలిపోతే అనే ఆలోచన కూడా వస్తుంటుంది. ఆ ఆలోచన పూర్తిగా సాగకుండానే మధ్యలో ఆగి పోయి కన్నీళ్ళు ఉబికి వస్తాయి రంగన్నకి. ఇప్పుడు కూడా అటువంటి ఊహల తర్వాత తాను, మనవడు కలిసి బతికున్నందుకు సంతోషిస్తూ కళ్లు తుడుచుకున్నాడు రంగన్న తాత.

***

ఏ ఊరికైనా సాధారణంగా తూర్పుపేట, పడమటి పేట తప్పకుండా ఉంటాయి. ఢిల్లీ రైలు ఆగదుగానీ, ఆ ఊరికీ ఉందో తూర్పుపేట. అక్కడే రంగన్న తాత పెంకుటిల్లు ఉంది. ఆ రోజు రంగన్న డ్యూటీకి వెళ్లాడు. కోరుకున్న క్షణం కోసం సుబ్బు ఊపిరి బిగపట్టుకొని



ఎదురుచూస్తూ ఇల్లెక్కాడు. ఇంటి మీదికి వాలిన చెట్టు కొమ్మల మీంచి కప్పుమీదికి జారి కూర్చున్నాడు.

అల్లెక్కడో దూరంగా, సనసన్నగా రైలు కూత వినబడింది. గొప్పింటి దూరపు చుట్టం అదే... చిన్న నల్లమచ్చ కదులుతూ వస్తోంది. అదిగోఅదే ఢిల్లీ రైలు.

టైములేదు... వచ్చేస్తోంది... వచ్చేస్తోంది... ఆపాలి... ఆపాలి... అనుకుంటూ ఇంటిపైకప్పు మీంచి దిగి ఆ కదిలివస్తున్న నల్లమచ్చ వైపు పరుగుపెట్టాడు.

రైలు పట్టాలు చేరుకున్నాడు. దూరం నుంచి పరిగెడుతూ వచ్చిపడుతున్న ఢిల్లీ రైలు స్పష్టంగా కనిపిస్తోంది. పట్టాల దారిలో ఎదురు పరిగెట్టాడు- యాక్సిడెంటయితే బండి ఆగుతుందని నమ్మకంగా తనకితాను చెప్పుకుంటూ!

***

రైలు కింద సుబ్బు, రైలు మోతలో వాడి అరుపు నలిగిపోవడం ఒక్క త్రుటిలో జరిగిపోయాయి.

స్టేషన్ మాస్టర్‌కి రంగన్న పచ్చజెండా అందించాడు. ఆయన ఊపాడు. ఢిల్లీ రైలు కూతపెడుతూ ఎప్పట్లాగే ఆగకుండా దాటిపోయింది!